క్లుప్తంగా

జీవామృతంతో చీడపీడల నివారణ

రేగిడి: జీవామృతంతో పంటకు పట్టే చీడపీడలు నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయం ఎల్2 గౌరీశ్వరరావు అన్నారు. మండలంలోని చాటాయవలస గ్రామంలో జీవామృతం తయారీపై ఆదివారం అవగాహన కల్పించారు. 5 కిలోల ఆవుపేడ, 5 లీటర్ల పశువుల మూత్రం, 200 గ్రాముల ఇంగువ ద్రావణాన్ని ఐదు లీటర్ల నీటిలో కలిపి ఓ తొట్టెలో నాలుగు రోజుల పాటు నిల్వ చేసిన తర్వాత ఉదయం, సాయంత్రం బాగా కలిపి, ఈ మిశ్రమానికి 150 గ్రాముల సున్నం, 200 గ్రాముల ఇంగువ వేయాలన్నారు. ఈ ద్రావణాన్ని 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరా పొలానికి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఐసీఆర్పీలు పి. తవిటినాయుడు, జి.రవి, పి.సురేష్ పాల్గొన్నారు.

కరకట్టలు నిర్మించండి

రేగిడి: మండలంలోని సంకిలి నాగావళి నది వద్ద కరకట్టల నిర్మాణం చేపట్టాలని జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు నారు జనార్దనరావు అధికారులను కోరుతున్నారు. ఇదే విషయమై ఆయన ఓ ప్రకటనలో ఆదివారం మాట్లాడుతూ వర్షాల సమయంలో నదిలో వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో తరచూ నది గట్టుభాగం కోతకు గురవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఇదే ప్రాంతంలో గ్రోయిన్ల నిర్మాణం ఉండేదని కాలక్రమేణా అవి వరదల్లో కొట్టుకుపోయాయన్నారు. ఇప్పటికైనా కరకట్టల నిర్మాణంజరగకపోతే తీరంలోని 600 ఎకరాల పొలాలు కోతకు గురవుతాయన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, కరకట్టల నిర్మాణానికి నిధులు వెచ్చించాలన్నారు.

నేడు రక్తదాన శిబిరం

రాజాం: పట్టణంలోని తెలగవీధిలో ఉన్న జీఎస్ఆర్ డిగ్రీ కళాశాల వద్ద సోమవారం రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు రాజాం వాసవీక్లబ్ వనితా శక్తి ప్రెసిడెంట్ పొట్నా శ్రీదేవి ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. కల్వకుంట్ల చంద్రసేనగుప్త జయంతి సందర్భంగా ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, యువతీ యువకులు పాల్గొని, రక్తదానం చేయాలని కోరారు.

రాజాం సిటీ: పట్టణంలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం ఆదివారం నిర్వహించారు. 40 మంది యువకులు రక్తదానం చేశారని రెడ్‌క్రాస్ సభ్యులు పెంకి చైతన్యకుమార్ తెలిపారు. కార్యక్రమంలో జనసేన ప్రచార కమిటీ రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్‌కుమార్, ఉమాశంకర్, అచ్యుత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీ మృతి


సూర్యనారాయణ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే లక్ష్మంనాయుడు

బాడంగి: మండలంలోని పూడివలస గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు పూడి సూర్యనారాయణ(85) శనివారం రాత్రి మృతి చెందారు. గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన స్వగృహంలోనే చనిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే లక్ష్మంనాయుడు ఆదివారం ఆ గ్రామం వెళ్లి, సూర్యనారాయణ భౌతికకాయం సందర్శించి, నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో తెంటు రవిబాబు, సర్పంచ్ రెడ్డి తిరుపతినాయుడు, మాజీ సర్పంచ్ పూడి రాము తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

తెర్లాం: వనమహోత్సవంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయం, అంగన్‌వాడీ కేంద్రం-5 ఆవరణల్లో ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేష్, అంగన్‌వాడీ కార్యకర్త వై.శ్రీదేవి, లైబ్రేరియన్ కృష్ణమూర్తి కలిసి మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని వారు కోరారు.

అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోండి

బొబ్బిలి: స్థానిక అమ్మిగారి కోనేరు గట్టుపై చేపట్టిన అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట అప్పన్న డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. కొంతమంది యథేచ్ఛగా ఇళ్లు, దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్నా అధికారుల చర్యలు మాత్రం శూన్యమన్నారు. మున్సిపల్ సిబ్బందికి ముడుపులు ఇచ్చి మరీ ఆక్రమణదారులు నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలని కోరారు.

యోగాతో ఆరోగ్యం

రాజాం: యోగాతో ఆరోగ్యం, మానసిక ప్రశాంతత లభిస్తుందని కూచిపూడి నాట్యాచార్యులు డాక్టర్ కళాకృష్ణ, హరికథ కథకులు దాలిపర్తి ఉమామహేశ్వరి అన్నారు. స్థానిక పట్టణంలో నూతనంగా ప్రారంభించిన శ్రీయోగా వికాస్ ట్రస్ట్‌ను వారు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరి జీవితంలో యోగా భాగం కావాలని, ప్రతిరోజూ యోగా చేసుకోవాలని తెలిపారు. అనంతరం వారిని ట్రస్ట్ నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకులు కె.శ్రీనివాసరావు, సౌందర్య తదితరులు పాల్గొన్నారు.


బాడంగి: పిన్నవలసలో పంటల పరిస్థితిని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారిణి శిరీష


బొబ్బిలి రూరల్: పారాది కాజ్‌వే వద్ద వేగావతి నది ప్రవాహాన్ని పరిశీలిస్తున్న తహసీల్దారు శ్రీను


బొబ్బిలి: రోడ్డుపై నిలిచిన వర్షపు నీటిని ట్యాంకర్‌లోకి తోడిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి


వంగర: ఓనెలగ్రహారంలో వర్షాలకు నేలకూలిన ఇంటి గోడను చూపిస్తున్న బాధితుడు


బాడంగి: గొల్లాది వద్ద వేగావతి నది ఉధృతిని పరిశీలిస్తున్న తహసీల్దారు సుధాకర్

తుపానుపై అప్రమత్తం

తుపాను కారణంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ప్రాణ నష్టం, ఆస్తినష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఉత్తర్వులు జారీ చేసింది. విద్యాసంస్థలకు సోమవారం సెలవు ప్రకటించగా, వైద్యారోగ్య, విద్యుత్, రోడ్లు, భవనాలు, వ్యవసాయ శాఖల అధికారులు అందుబాటులో ఉండాలని సూచించారు. మరోవైపు మండల స్థాయి అధికారులు తుపాను సహాయక చర్యలు ముమ్మరం చేశారు. నీటమునిగిన, పాడైన పంటలు సహా దెబ్బతిన్న, కూలిన ఇళ్లను ఆదివారం పరిశీలించారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు సముద్ర, నదీతీరాలకు వెళ్లి, మృత్యువు బారినపడకుండా దండోరా వేయించి, అలర్ట్ చేశారు.

-బొబ్బిలి, రాజాం


రేగిడి: సంకిలి దగ్గరున్న నాగావళి నదీ తీరాన్ని పరిశీలిస్తున్న తహసీల్దారు ఎల్లారావు


సంతకవిటి: ఫోన్‌లో పంచాయతీ కార్యదర్శులను అప్రమత్తం చేస్తున్న మండల పరిషత్ ఏవో రఘునాథాచారి

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

రామభద్రపురం: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, గ్రంథాలయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని లైబ్రేరియన్ సత్యవాణి కోరారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తక పఠనం, చిత్రలేఖనం, వక్తృత్వం, సంగీతం, నృత్యం, స్పోకెన్ ఇంగ్లిష్‌లపై ఆదివారం శిక్షణ ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే పుస్తకాలు చదవడాన్ని అలవాటుగా చేసుకోవాలన్నారు. పుస్తకాలు చదవడం ద్వారా అపారమైన జ్ఞానం లభిస్తుందన్నారు. ప్రతిరోజూ గ్రంథాలయానికి వచ్చి,అవసరమైన పుస్తకాలు చదువుకోవాలన్నారు.


బాడంగి: ఆసక్తిగా పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

తెర్లాం: ప్రతిరోజూ పుస్తక పఠనం చేయడం ద్వారా విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం అనే కార్యక్రమం నిర్వహించారు. గ్రంథాలయానికి వచ్చిన విద్యార్థులతో పుస్తకాలు ఎలా చదవాలి, చదివిన విషయాన్ని ఏ విధంగా అర్థం చేసుకోవాలన్న దానిపై అవగాహన కల్పించారు. పుస్తక పఠనంతో పాటు చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో కూడా విద్యార్థులు తర్ఫీదు పొందాలన్నారు. గ్రంథాలయంలోని చిల్డ్రన్స్ క్లబ్‌లో విద్యార్థులు చేరాలన్నారు. కార్యక్రమంలో నెమలాం హైస్కూల్ క్రాఫ్ట్ ఉపాధ్యాయుడు విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించి, గ్రంథాలయానికి విచ్చేసిన విద్యార్థులతో లైబ్రేరియన్ దుర్గాప్రసాద్ పుస్తకాలు చదివించారు. అనంతరం పుస్తక పఠనం ప్రయోజనాలను వివరించారు.


రామభద్రపురం: విద్యార్థినితో పుస్తకం చదివిస్తున్న లైబ్రేరియన్ సత్యవాణి


తెర్లాం: పుస్తకాలు చదివి ఎలా అర్థం చేసుకోవాలో తెలియజేస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

నేడు వైఎస్సార్ వర్ధంతి


డాక్టర్ తలే రాజేష్

రాజాం: మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 16వ వర్ధంతి సోమవారం నిర్వహిస్తున్నట్లు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. ఉదయం 10 గంటలకు పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించిన అనంతరం మాధవబజారులోని వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పించి, పలు సేవా కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులంతా హాజరుకావాలని కోరారు.

రామభద్రపురం: మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సోమవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ సభ్యురాలు అప్పికొండ సరస్వతి ఆదివారం తెలిపారు. మహానేతకు నివాళులర్పించడంతో పాటు ప్రభుత్వాస్పత్రిలోని రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేయనున్నామన్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులంతా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.


రామభద్రపురం: కార్యక్రమానికి తరలిరావాలని కోరుతున్న ఎంపీపీ లక్ష్మణరావు, జెడ్పీటీసీ సరస్వతి

తెర్లాం: మండల కేంద్రం సహా మహానేత వైఎస్సార్ విగ్రహాలున్న ప్రతీ గ్రామంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సోమవారం నిర్వహిస్తున్నామని పార్టీ మండల అధ్యక్షుడు తెంటు సత్యంనాయుడు తెలిపారు. పార్టీ శ్రేణులంతా కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

బొబ్బిలి: మండల కేంద్రంతో పాటు వైఎస్సార్ విగ్రహాలు ఉన్న ప్రతీ గ్రామంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సోమవారం నిర్వహిస్తున్నామని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు తెలిపారు. పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొని, మహానేత వైఎస్సార్‌కు నివాళులర్పించాలన్నారు.

పరామర్శ

రాజాం సిటీ: పట్టణ పరిధిలోని మారుతీనగర్ ఐదో లైన్‌కు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు పాలవలస రాంబాబును పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ పరామర్శించారు. రాంబాబు తండ్రి వెంకటినాయుడు ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆయన బాధిత కుటుంబాన్ని ఆదివారం కలిసి, ఓదార్చారు. అనంతరం మృతికి గల కారణాలు అడిగి తెలుసుకుని, ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, కెంబూరు నారాయణరావు, గోకవలస బాబూరావు, పాలవలస బాబ్జి, పాలవలస శ్రీను, శ్యామసుందర్ పాల్గొన్నారు.


రాంబాబును పరామర్శిస్తున్న డాక్టర్ తలే రాజేష్, తదితరులు

నడిరోడ్డుపై సభ ఏర్పాటుపై విమర్శలు

బొబ్బిలి: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ప్రభుత్వాస్పత్రి పక్కన రోడ్డుపై ఆదివారం సభ ఏర్పాటు చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇదే కార్యక్రమంలో బొబ్బిలి, కురుపాం, నెల్లిమర్ల, పార్వతీపురం నియోజకవర్గాల ఎమ్మెల్యేలు పాల్గొనగా, సాంస్కృతిక కళాప్రదర్శనలు జరిగాయి. పెద్దపెద్ద డీజే సౌండ్‌లతో కార్యక్రమం జరగడం.. ఆ పక్కనే ఆస్పత్రి ఉండడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారు, అటువైపుగా వెళ్లేవారు ఇబ్బందులు పడ్డారు.

ఆస్పత్రిలో అప్పుడే పుట్టిన పిల్లలు, చికిత్స పొందుతున్న పసికందులు ఉన్నారని, అంత శబ్దాలతో కార్యక్రమం జరిగితే ఎలా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10 గంటలు దాటినంత వరకు కార్యక్రమం ఇలానే జరగడంతో చాలామంది విసుక్కుని, బాధ్యతాయుతమైన పదవుల్లో ఉండి ఇలా చేస్తే ఎలా అని కూటమి నాయకులను ఉద్దేశించి పలువురు విమర్శించారు.

అన్నదానం

రేగిడి: మండలంలోని వావిలవలస గ్రామంలో శ్రీరామధర్మ క్షేత్రంలో చిరువ్యాపారి వారణాసి జగన్నాథం సహకారంతో ఆదివారం అన్నదానం చేశారు. తన సంపాదనలో కొంత మొత్తాన్ని నిరుపేదలకు భోజనం పెట్టేందుకు వినియోగిస్తుండడం చాలా ఆనందంగా ఉందని ఆయన అన్నారు. దాతల సాయంతో నిత్యాన్నదానం చేస్తున్నామన్నారు.

ఘనంగా వారాల సంబరాలు

బొబ్బిలి: మండల కేంద్రంలోని పాతబొబ్బిలిలో దేశతల్లి వారాల సంబరాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో మంగళవాయిద్యాల నడుమ అమ్మవారి ప్రభలను ఊరేగించారు. మంగళవారం సరేపోలమ్మ ఉత్సవాలతో ఈ వారాల సంబరాలు ముగుస్తాయని స్థానికులు తెలిపారు.

ఏపీటీఎఫ్ నిరసన

బొబ్బిలి రూరల్: పాతపెన్షన్ విధానమే అమలు చేయాలని ఏపీటీఎఫ్(ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్) రాష్ట్ర కార్యదర్శి పువ్వల ధనుంజయరావు డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన సంఘ సభ్యులతో కలిసి మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆదివారం నిరసన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన యూపీఎస్(యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్)తో పాటు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని చూస్తున్న సీపీఎస్ విధానాన్ని సైతం రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో డి.వెంకటనాయుడు, ఎస్.సన్యాసినాయుడు, కె.గోపాలకృష్ణ, రాము తదితరులు పాల్గొన్నారు.


బొబ్బిలి రూరల్: ఎంపీడీవో కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న ఏపీటీఎఫ్ ప్రతినిధులు

రాజాం: కొత్త పెన్షన్ విధానం రద్దు చేసి, పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీటీఎఫ్ రాజాం శాఖ ప్రతినిధులు స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద ఆదివారం నిరసన చేపట్టారు. ఆంధ్రప్రదేశ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల ఉద్యోగులంతా హాజరై, సీపీఎస్, జీపీఎస్, యూపీఎస్ రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానం అమలుచేయాలని కోరారు. అనంతరం డీటీ వెంకటేష్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.వెంకటరమణ, ఎల్.రామకృష్ణ, జిల్లా కార్యదర్శులు ఎస్.రవికుమార్, వై.భాస్కరరావు పాల్గొన్నారు.

‘సూపర్ సిక్స్’ అమలెప్పుడు?

- మాజీ ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర



మెంటాడ: సూపర్ సిక్స్ పేరిట ఇచ్చిన సంక్షేమ పథకాల హామీలు ఎప్పుడు అమలు చేస్తారని మాజీ ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మండల కేంద్రంలోని విలేకరులతో ఆయన ఆదివారం మాట్లాడుతూ గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనకు, ఇప్పటి కూటమి ప్రభుత్వ పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను ప్రజలు గమనిస్తున్నారన్నారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా ఎన్నికల హామీలు నెరవేర్చే దిశగా ఆలోచన చేయకపోవడం దారుణమన్నారు. ఆగస్టు 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవం నాడు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీ అమలు ప్రకటిస్తారని అంతా ఆశగా ఎదురుచూశారని వారికి ఆ ఎదురుచూపు ఇంకా తప్పలేదన్నారు. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామన్నారని, ఇప్పుడు ఆ ఊసే లేదన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతీ మహిళలకు నెలకు రూ.1500, బడికి వెళ్లే ప్రతీ విద్యార్థికి ఏడాదికి రూ.15 వేలు, వ్యవసాయానికి పెట్టుబడి సాయంగా ప్రతీ రైతుకు ఏడాదికి రూ.20 వేలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు యాభై ఏళ్లకే పింఛన్, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి వంటి హామీలు ఇచ్చిన విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు మర్చిపోయినట్లు ఉన్నారని ఎద్దేవా చేశారు. ఎన్నికల సమయంలో లేనిపోని హామీలతో ప్రజలను ఊదరగొట్టారని, తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత ఖజానా ఖాళీ అంటూ హామీలు ఎగ్గొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని దుయ్యబట్టారు.

హామీలు ఎగ్గొట్టే ప్రయత్నం..

తనకు నలభై ఏళ్ల రాజకీయ అనుభవం అనుకుని చెప్పుకుని తిరిగే చంద్రబాబుకు హామీలు ఇచ్చినప్పుడు రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు తెలియవా అని నిలదీశారు. ఎంత కష్టమైనా ఆనాడు ఇచ్చిన మాట ప్రకారం జగనన్న ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చారన్నారు. ఇప్పుడు ఇస్తున్న పింఛన్లు కూడా నెలనెలా తగ్గిపోతున్నాయని ఆరోపించారు. చాలా మంది తమ పింఛన్లు తీసేస్తున్నారని, తీసేశారని గగ్గోలు పెడుతున్నారన్నారు. ప్రజలు ఎక్కడ హామీలు అమలు చేయాలని రోడ్డెక్కుతారోనని రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఆఖరికి హాస్టల్ విద్యార్థులకు కూడా సరిగా భోజనం పెట్టలేని దుస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని ధ్వజమెత్తారు. కొన్నిరోజులుగా పలుచోట్ల పాఠశాలలు, వసతిగృహాలు, గురుకులాలు, ఆఖరికి ట్రిపుల్ ఐటీలో కూడా భోజనం బాగాలేక పలువురు విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రి పాలైన ఘటనలు చూస్తుండడం విచారకరమన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని నిలబెట్టాలని, లేకపోతే ప్రజాగ్రహానికి గురికాక తప్పదన్నారు. ఇప్పటికైనా కక్షపూరిత రాజకీయాలు మాని, ప్రజలకు మంచి చేయాలని హితవుపలికారు.



మట్టి ప్రతిమలనే పూజిద్దాం

- మట్టి వినాయక విగ్రహాల పంపిణీలో వక్తలు


రాజాం: మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేస్తున్న పర్యావరణ పరిరక్షణ సమితి కన్వీనర్ నాయుడు

రాజాం: వినాయక చవితి పండగలో ప్రతిఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలనే పూజించి, పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలని రాజాం పర్యావరణ పరిరక్షణ సమితి కన్వీనర్ ఆర్‌వీజే నాయుడు పిలుపునిచ్చారు. స్థానిక పట్టణంలోని సూపర్ మార్కెట్ వద్ద మట్టి వినాయక ప్రతిమలను ఆదివారం ఉచితంగా పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారైన విగ్రహాలు వినియోగించడం ద్వారా పర్యావరణం కలుషితమవుతోందని, తద్వారా సకల జీవరాశులు అనారోగ్యం బారినపడుతున్నాయన్నారు. మట్టి విగ్రహాల ఆరాధనను ప్రోత్సహిస్తూ సూపర్ మార్కెట్ యాజమాన్యం 1001 మట్టి వినాయక ప్రతిమలు ఉచితంగా అందజేస్తోందని, ఆ యాజమాన్యానికి అభినందనలన్నారు. కార్యక్రమంలో రాజాం పట్టణానికి చెందిన పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, గ్రీన్‌బెల్ట్ సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


రాజాం సిటీ: ఉచితంగా మట్టి విగ్రహాలు అందజేస్తున్న వాసవీక్లబ్ సభ్యులు



బొబ్బిలి రూరల్: మట్టి విగ్రహాలు అందజేస్తున్న ఎంపీడీవో రవికుమార్

రాజాం సిటీ: స్థానిక వైఎస్సార్ పార్కు, బజారువీధుల్లో వాసవీక్లబ్ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలు ఆదివారం ఉచితంగా పంపిణీ చేశారు. ఈ నెల 7వ తేదీన వినాయక చవితి పురస్కరించుకుని, విగ్రహాలతో పాటు కథాపుస్తకాలను అందజేశామని వాసవీక్లబ్ ఆర్‌సీ వీవీ మన్మథరాజా, జెడ్‌సీ జి.రవికుమార్‌లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు తమవంతు బాధ్యతగా మట్టి ప్రతిమలను ప్రజలకు అందిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలనే పూజించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షుడు అంబరీష్, నగేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి..

బొబ్బిలి రూరల్: మట్టి విగ్రహాలనే పూజించి, పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని ఎంపీడీవో పి.రవికుమార్ పిలుపునిచ్చారు. మండల పరిషత్ కార్యాలయంలో గ్రీన్‌బెల్ట్ ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమల పంపిణీ ఆదివారం చేపట్టారు. పీవోపీ(ప్లాస్టర్ ఆఫ్ పారిస్)తో తయారు చేసిన విగ్రహాలను వినియోగించడం ద్వారా పర్యావరణానికి హాని కలుగుతుందని, అందరూ మట్టి వినాయక విగ్రహాలనే పూజించాలని ఎంపీడీవో కోరారు. కార్యక్రమంలో గ్రీన్‌బెల్ట్ సొసైటీ ప్రతినిధులు మీసాల గౌరినాయుడు, లక్ష్మణరావు, వనమిత్ర కృష్ణదాస్ తదితరులు పాల్గొన్నారు.

మండపాలకు అనుమతులు తప్పనిసరి..


సీఐ ఉపేంద్ర

రాజాం: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసే మండపాలకు సంబంధించి, అనుమతులు తప్పనిసరి గా తీసుకోవాలని రాజాం రూరల్ సీఐ ఉపేంద్ర అన్నారు. ఇదే విషయమై స్థానిక సర్కిల్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఆదివారం నిర్వహించి, మాట్లాడారు. సింగిల్ విండో విధానం ద్వారా వినాయక మండపాల ఏర్పాటుకు అనుమతులు ఇస్తున్నామని, మండపాలు పెట్టే ప్రాంతం, వినాయకుడి ప్రతిమ పరిమాణం, వేడుకలు నిర్వహించే రోజులు, నిమజ్జన ప్రాంతాలు, కమిటీ సభ్యులు వివరాలు, ఏర్పాటు చేయనున్న కార్యక్రమాలు వంటి వివరాలను ఆన్‌లైన్‌లో దరఖాస్తులో తెలియజేయాలన్నారు.